# సాక్షి
# జయశంకర్ భూపాలపల్లి

సోమవారం। 22। సెప్టెంబర్। 2025




### వేగానికి కళ్లెమేదీ?

వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

- 10లో ▸



### అలరించిన ఐలమ్మ నృత్యరూపకం

- 10లో ▸

బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ నృత్యరూపకం అలరించింది.




### వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నేటి నుంచి ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలు

**భూపాలపల్లి అర్బన్:** నేటినుంచి (సోమవారం ) ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

### కాళేశ్వరంలో అన్నదానం



**కాళేశ్వరం:** పితృపక్షాలను పురస్కరించుకొని అమావాస్య సందర్భంగా కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి దేవస్థాన ఆవరణలో మహదేవపూర్ గ్రామానికి చెందిన నూక సత్యనారాయణ, ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు హాజరై భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, కాళేశ్వరం మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమత, దేవస్థానం మాజీ డైరెక్టర్‌లు గందెసి సత్యనారాయణ, మెంగాని అశోక్, సీనియర్ నాయకులు గందె సిరి మధుసూదన్ పాల్గొన్నారు.

### జీఓ నంబర్ 64ను రద్దు చేయాలి



**భూపాలపల్లి అర్బన్:** జీఓనంబర్ 64ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదురుగా ఆశ్రమ పాఠశాలల కాంటిజెన్సీ వర్కర్స్ చేపడుతున్న దీక్షలు ఆదివారం నాటికి 10వ రోజుకు చేరుకోగా బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. వారి దీక్షలకు సాయిలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. జీఓ వలన వేతనాలు తగ్గుతున్నాయన్నారు. నూతన జీఓను సవరించి పాత జీఓ 212ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జావీద్, వెంకటలక్ష్మి, కిషన్, రామ్‌సింగ్, కంటిభాయ్, స్వరూప, విజయ, ఎర్రక్క పాల్గొన్నారు.

### నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం



**మొగుళ్లపల్లి :** ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు 69 మందికి రూ.16.50లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ

**చిట్యాల:** మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన జాలిగపు కొంరయ్య, మండలకేంద్రంలో పెరుమాండ్ల కృష్ణగౌడ్, అందుకుతండాలో దాసారపు రాజయ్య(డీలర్), నైన్‌పాకలో వావిళ్ల రాములు, మండ రాజక్క, బిక్కనూరి లచ్చక్క ఇటీవల మృతిచెందారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు బుర్ర లక్ష్మన్, గుర్రపు తిరుపతిగౌడ్, చిలుకల రాయకొంరు, దొడ్డి కిష్టయ్య ఉన్నారు.

భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు





భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



# పూల పండుగ షురూ..

'ఒక్కేసి పువ్వేసి చందమామ.. బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ ఆటా పాటలతో ఆడపడుచుల పండుగ బతుకమ్మ ఆదివారం ప్రారంభమైంది. జిల్లాలో ఉదయం నుంచే పూల సేకరణలో నిమగ్నమైన మహిళలు సాయంత్రానికి తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు. కుటుంబీకులు, బంధువులు, స్నేహితులతో కలిసి సమీప ఆలయాలు, కూడళ్లలో బతుకమ్మలను ఒక చోట చేర్చారు. చప్పట్లతో చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. బతుకమ్మ పాటలతో వీధులు మారుమోగాయి. ఆడపడుచులకు అతిపెద్ద పండుగైన బతుకమ్మ ఎంగిలిపూలతో ప్రారంభమైంది. జిల్లాకేంద్రంలో బతుకమ్మ ఆడుకునేందుకు మున్సిపాలిటీ, గ్రామాలలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆట స్థలాలు చదునుచేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు.

\- భూపాలపల్లి అర్బన్

- మరిన్ని ఫొటోలు 11లో ▸



భూపాలపల్లి పట్టణంలోని హన్‌మాన్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

# నేటినుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- ముస్తాబైన అమ్మవార్ల ఆలయాలు
- నేడు బాల త్రిపురా సుందరిదేవి అలంకరణ

**కాళేశ్వరం:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయాల్లో నేటి(సోమవారం) నుంచి అక్టోబర్ 2 వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఈసారి తిథులు కలిసి ఒకే రోజు రావడంతో ఒక రోజు పెరిగి పదకొండు రోజుల పాటు వివిధ అలంకరణల్లో భక్తులకు శ్రీశుభానందదేవి(పార్వతి), శ్రీసరస్వతి అమ్మవార్లు వివిధ అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు.

**వివిధ అలంకరణలు..**

22న బాలత్రిపురా సుందరి దేవి , 23న గాయత్రీ దేవి, 24న అన్నపూర్ణదేవి, 25న కాత్యాయనిదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న లలితాదేవి, 28న మహాచండీ దేవి, 29న మూలనక్షత్రం సందర్భంగా శ్రీసరస్వతిదేవి, 30న దుర్గాదేవి (దుర్గాష్టమి), అక్టోబర్ 1న మహిషాసుర మర్దిని దేవి (మహర్నవమి) అదే రోజున మధ్యాహ్నం బలిహరణం, పూర్ణాహుతి యాగశాలలో హోమం కార్యక్రమం నిర్వహిస్తారు. 2న రాజరాజేశ్వరీదేవి అలంకరణల్లో భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. దీంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియనున్నాయి. విజయ దశమి (దసరా) సందర్భంగా సాయంత్రం శ్రీరామాలయం నుంచి గోదావరికి మంగళవాయిద్యాలతో బయలుదేరి 4.30గంటలకు శమీ పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం ప్రసాద వితరణ చేస్తారు. ఉత్సవాలకు 11 రోజులు ప్రత్యేకంగా ప్రతి రోజు వరంగల్‌కు చెందిన వారితో డెకరేషన్స్ పూలతో అలంకరిస్తారు. ఇప్పటికే ఆలయాలు విద్యుత్ బల్బులతో అలంకరిస్తున్నారు.



విద్యుత్ కాంతులతో శ్రీసరస్వతీదేవి ఆలయం

# కల్చరల్ పోటీలు ప్రారంభం

**భూపాలపల్లి అర్బన్:** సింగరేణి వర్క్‌పీపుల్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏరియా స్థాయి కల్చరల్ పోటీలను ప్రారంభించారు. ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఏరియా అధికార ప్రతినిధి, పర్సనల్ మేనేజర్ మారుతి హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజిక్, డాన్స్, ఇతర వైవిధ్యమైన కార్యక్రమాల్లో ప్రతిభను ప్రదర్శించారు. సింగరేణి సంస్థ సాంస్కృతిక సంపదను సమృద్ధి చేస్తూ ఉద్యోగుల ఆనంద, సామాజిక ఐక్యతను పెంచేందుకు కృషి చేస్తుందన్నారు. కోలిండియా స్థాయిలో రాణించే విధంగా ప్రదర్శనలు ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, కోఆర్డినేటర్ పాక దేవయ్య, కల్చరల్ కోఆర్డినేటర్ అడిచర్ల శ్రీనివాస్, కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్సనల్ మేనేజర్ మారుతి

### సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి:** పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరూ కుటుంబసమేతంగా ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ స్త్రీ శక్తిని ప్రతిబింబించే పండుగగా నిలుస్తుందన్నారు. బతుకమ్మలను నిమజ్జనం చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, సోదరభావంతో బతుకమ్మ పండుగను దిగ్విజయంగా జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు.

# చోరీలు జరగకుండా ముందస్తు చర్యలు

- ఎస్పీ కిరణ్ ఖరే



కిరణ్ ఖరే, ఎస్పీ

**భూపాలపల్లి:** బతుకమ్మ, దసరా పండుగ సెలవుల నేపథ్యంలో జిల్లాలో చోరీలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండుగల సందర్భంగా వేలాది మంది సొంత ఊర్లకు వెళ్లే అవకాశం ఉందని, ఈ సమయాల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున పోలీసు గస్తీని మరింత పెంచుతామన్నారు. ఊర్లకు వెళ్తున్న వారు కూడా తమ వంతుగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక పోలీసులతో పాటు క్రైం విభాగం ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఇళ్ల పరిసరాలు, షాపింగ్ మాళ్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊళ్లకు వెళ్లే వారు ముందస్తుగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. బీరువా తాళాలు ఇంట్లో వదిలి వెళ్లవద్దని, ఇంట్లోని ఒక గదిలో లైట్ వేసి ఉంచాలన్నారు. ఎక్కువ రోజులు విహారయాత్రలకు వెళ్లే వారు పేపర్, పాల డెలివరీని ఆపేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే డయల్ 100 లేదా భూపాలపల్లి పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 87126 58159కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.

### పండుగలకు ప్రత్యేక సర్వీసులు

**భూపాలపల్లి:** బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు ఆర్టీసీ భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు భూపాలపల్లి డిపో నుంచి హనుమకొండ, గోదావరిఖని, కాళేశ్వరం, హైదరాబాద్‌లకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. మహాలక్ష్మి పథకం దృష్ట్యా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రయాణికులకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. హనుమకొండ-కాళేశ్వరం రూట్‌లో రోజుకు 10 బస్సులు, గోదావరిఖనికి ఐదు బస్సు సర్వీసులు నడిపిస్తామన్నారు. రద్దీ పెరిగితే ఇతర రూట్లలో కూడా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని డీఎం కోరారు.

### మునిగిన పంట పొలాలు

**మల్హర్:** మానేరు బ్యాక్ వాటర్ కారణంగా మల్హర్ మండలంలోని వల్లెకుంట మానేరు శివారులోని పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని రోజులు కురిస్తున్న వర్షాలతో ప్రవాహం పెరిగింది. ఇటీవల కరీంనగర్ డ్యాం గేట్లు ఎత్తడంతో తాడిచర్ల- ఖమ్మంపల్లి మానేరులో వరద ప్రవాహం పెరిగింది. దీంతో అడవి సోమన్‌పల్లి, వల్లెకుంట వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ వద్ద వరద పెరగడంతో వల్లెకుంట శివారులోని 15 ఎకరాల మేరకు పంట పొలాలు నీట మునిగాయి. పొలాలు మునగడంతో తమ పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీట మునిగిన పొలాన్ని చూపిస్తున్న రైతు

# 'రాజీవ్ యువ వికాసం' అందేదెప్పుడు..?

- జిల్లాలో 21,231 మంది దరఖాస్తుదారులు
- రుణాల మంజూరు కోసం ఎదురుచూపు

**భూపాలపల్లి:** నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకం ఇంకెప్పుడు అందుతుందా అని దరఖాస్తుదారులు వేచి చూస్తున్నారు. నాలుగు నెలల క్రితం దరఖాస్తులు స్వీకరించిన సర్కారు, ఇప్పటి వరకు లబ్ధిదారుల ఎంపిక చేయకపోవడం, పథకం అమలుపై ఎటువంటి ప్రకటనలూ జారీ చేయకపోవడంతో నిరుద్యోగుల్లో నిరాసక్తి నెలకొంటుంది.

**4 నెలలుగా ఎదురుచూపు..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం నిరుద్యోగ యువతీ, యువకులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఏడాది మే 14వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించగా, జిల్లావ్యాప్తంగా 21,231 మంది యువత దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో నుంచి 2,625 అప్లికేషన్లు రాగా, అత్యల్పంగా పలిమెల మండలం నుంచి 454 వచ్చాయి. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించి ఎంపిక చేసే బాధ్యతను కమిటీలకు అప్పగించారు. మండల స్థాయిలో ఎంపీడీఓ చైర్మన్‌గా, మండల ప్రత్యేక అధికారి, బ్యాంక్ మేనేజర్, సెర్ప్ ఏపీఎం, కార్పొరేషన్ల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ, జిల్లా సంక్షేమ అధికారి, కార్పొరేషన్ల జిల్లా అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉన్నారు. గడువులోగా స్వీకరించిన దరఖాస్తులను మండల స్థాయిలో పరిశీలించి జిల్లాకు పంపించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు, సూచనలు రాకపోవడంతో అర్హుల ఎంపిక జాబితా వెల్లడి, రుణాల మంజూరు విషయాన్ని జిల్లా అధికారులు వెల్లడించడం లేదు.

| కార్పొరేషన్ల వారిగా అందిన దరఖాస్తులు | |
|---|---|
| బీసీ | 11,028 |
| ఎస్సీ | 6,711 |
| ఎస్టీ | 2,333 |
| మైనార్టీ | 749 |
| ఈబీసీ | 401 |
| క్రిస్టియన్ | 9 |
| మొత్తం | 21,231 |

**ఉపాధి కోసం..**

జిల్లాలో వేలాది మంది యువతీ, యువకులు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాలు దొరకక ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకురావడంతో వేలాది మంది చిన్నచిన్న పరిశ్రమలు, కుల వృత్తుల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రుణం మంజూరు చేస్తే ఇప్పటికిప్పుడు ఉపాధి బాట ఎంచుకొని ఆర్థికంగా స్థిరపడుతామని యువత వెల్లడిస్తున్నారు.

# నిషేధించినా ఆగట్లేరు..

- దొంగచాటున నిషేధిత జలపాతాల సందర్శన
- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న పర్యాటకులు



వాజేడు: బొగత జలపాతం

**వాజేడు:** ములుగు జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల సందర్శనను నిలిపివేసినా.. చెప్పాపెట్టకుండా, అధికారుల కళ్లుగప్పి దొడ్డిదారిన పలువురు పర్యాటకులు వెళ్తున్నారు. రక్షణ లేని జలపాతాలను చూస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పర్యాటకులకు ఎంత చెప్పినా.. ఏర్పాట్లు కట్టుదిట్టం చేసినా వెళ్లడం మాత్రం మానడం లేదు. ఈ క్రమంలోనే సోమవారం మండల పరిధిలోని కొంగాల సమీపంలోని గుట్టల్లో ఉన్న దూసపాటి లొద్ది జలపాతాన్ని చూసేందుకు హైదరాబాద్‌కు చెందిన కొండిశెట్టి మహేశ్విన్(18) తన మిత్రులతో కలిసి అక్కడకు చేరుకున్నాడు. ఫొటోలు దిగుతూ ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి గల్లంతయ్యాడు. మంగళవారం జీపీ సిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టగా మృతదేహం బయటపడింది.

**నిషేధిత జలపాతాల వద్దకు వెళ్లొద్దు**

జిల్లాలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ముత్యంధార, మాసన్ లొద్ది, భామన సిరి, గుండం , దూసపాటి లొద్ది మొదలైన జలపాతాల సందర్శనను వెళ్లవద్దని కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వర్షాకాలం ప్రారంభంలోనే అధికారికంగా ప్రకటించారు. చెక్ పోస్టులు సైతం ఏర్పాటు చేశారు. కొందరు పర్యాటకులు సిబ్బంది విధులకు రాని సమయం కంటే ముందే, మరికొందరు దొంగదారుల్లో జలపాతాల వద్దకు వెళ్లి వస్తున్నట్లు సమాచారం . ఈ మధ్య కాలంలో ముత్యంధార జలపాతానికి వెళ్లిన కొందరు పర్యాటకులు వెళ్లి ఒక్కరు తప్పిపోవడంతో అధికారులు రాత్రంతా గాలించి వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటన మరచిపోకముందే దూసపాటి లొద్దికి వెళ్లిన యువకుడు మృత్యువాత పడడం విషాదకరంగా మారింది.

# హామీలను నెరవేర్చాలి

**రేగొండ:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ దోర్నాల రాజేందర్ ఆధ్వర్యంలో దివ్యాంగుల, చేయూత పెన్షన్‌దారుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్‌లను పెంచాలని లేనియెడల పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న మండలకేంద్రంలో నిర్వహిస్తున్న సన్నాహక సభకు మందకృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. ఈ సభకు అధిక సంఖ్యలో పెన్షన్‌దారులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి, నాయకులు నోముల శ్రీనివాస్, మంద తిరుపతి, ఎర్ర భద్రయ్య, ఆరెపల్లి రాజు, కొండమల్ల విష్ణు పాల్గొన్నారు.



సమావేశంలో నాయకులు, కార్యకర్తలు

## క్లుప్తంగా

### 7నుంచి బీఫార్మసీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీ ఫార్మసీ( సీబీసీఎస్) (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ )రెండో సెమిస్టర్ పరీక్షలు అక్టోబర్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ తెలిపారు. అక్టోబర్ 7న మొదటి- 1 హ్యూమన్ అనాటమీ ఫిజియాలజీ, 9న పేపర్-2 ఫార్మాస్యూటికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, 13న పేపర్-3 బయోకెమిస్ట్రీ, 15న పేపర్-4 పాథోఫిజియాలజీ పరీక్షలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

**7నుంచి బీఫార్మసీ సెకండియర్ మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ..**

కేయూ పరిధిలో బీఫార్మసీ (నాన్‌సీబీసీఎస్) సెకండియర్ మొదటి సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షలు అక్టోబర్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ తెలిపారు. అక్టోబర్ 7న పేపర్ -1 బయోస్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్, పేపర్-2 ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, పేపర్-3 ఫార్మాస్యూటికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, 8న పేపర్-5 ఫార్మాస్యూటికల్ మైక్రో బయాలజీ అండ్ ఇమ్యూనాలజీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటలవరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కుమారస్వామి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: బస్టాండ్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఘన్‌పూర్‌కు చెందిన మోటం కుమారస్వామి(50) కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి వ్యక్తిగత పనుల నిమిత్తం బస్టాండ్ వద్ద జాతీయ రహదారి దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కుమారస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదం తీరును పరిశీలించారు. అనంతరం శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అమ్మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

### ప్రైవేట్ ఆస్పత్రిలో బాలిక ప్రసవం

- నర్సు ద్వారా శిశువు విక్రయానికి యత్నం?

ఖమ్మం వైద్యవిభాగం/ఖమ్మం క్రైం: ఓ మైనర్ బాలిక ప్రసవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఓ తండాకు చెందిన సదరు బాలిక గర్భం దాల్చగా.. నెలలు నిండడంతో కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం చేర్పించినట్లు సమాచారం. అక్కడ బాలిక ఆడశిశువుకు జన్మనివ్వగా, పాపను తీసుకెళ్లేందుకు వారు నిరాకరించారని తెలిసింది. దీంతో శిశువును అమ్మేందుకు ఆస్పత్రి నర్సు ద్వారా బేరసారాలు సాగించినట్లు సమాచారం. ఈవిషయం బయటకు పొక్కడంతో ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతోపాటు పోలీసులు విచారణ చేపట్టారు. శిశువును స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే, చివరకు బాలిక బంధువులే తీసుకెళ్తామని చెప్పినట్లు సమాచారం. కాగా, బాలిక గర్భానికి అదే తండాకు చెందిన యువకుడు కారణమని గుర్తించి ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశాక, మరిపెడ పోలీసుస్టేషన్‌కు బదలాయించారు. అయితే, శిశువు అమ్మకం విషయమై పై వివరణ కోరేందుకు బాలల సంరక్షణ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదు.



# వేగానికి కళ్లెమేది?

**రహదారులపై కనిపించని స్పీడ్‌గన్**
- నగరంలోనే తనిఖీలు, జరిమానాలు
- శివారుల్లో కనిపించని వెహికిల్ చెకింగ్‌లు
- ఫలితంగా వాహనదారుల అతివేగంతో తగ్గని ప్రమాదాలు

ఖిలా వరంగల్: ఉమ్మడి వరంగల్ జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. వాహనదారులు అతివేగం వెళ్తూ కూడళ్లు, మలుపు వద్ద వాహన వేగాన్ని నియంత్రించడం లేదు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఘటనల ఫలితంగా ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటోంది.

**నగరానికే పరిమితమవుతున్న తనిఖీలు..**

స్పీడ్‌గన్‌తో వేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించడం వరంగల్ నగరానికే పరిమితమవుతోంది. ఫలితంగా వాహనాల వేగానికి కళ్లెం పడక రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై నిత్యం ఏదో ఒక చోట ప్రాణాల పోగొట్టుకుంటున్నారు. పదుల సంఖ్యలో గాయాలపాలవుతున్నారు. ఒక్క మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈఏడాది 8మంది మృత్యువాత పడగా 20 మందికి పైగా తీవ్రగాయాల పాలయ్యారు.

**ఏడాదికి 20 వేలపైనే ప్రమాదాలు ..**

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఎక్కువ హైదరాబాద్ జాతీయ రహదారిపై రోజూ ఒకటి, రెండు ఠాణాల పరిధిలో స్పీడ్‌గన్ వాహనం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. జాతీయ రహదారులపై ఏడాదికి 20వేలకు పైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అందులో నెలకు 10 మంది లోపు మృత్యువాత పడుతున్నారు. గతంలో అతివేగంగా వెళ్లిన ప్రతీ వాహనం గుర్తించి రూ.వెయ్యి వరకు జరిమానా విధించే వారు. ప్రస్తుతం నగర పరిధికి పరిమితమయ్యిందని పలువురు పేర్కొంటున్నారు. ప్రమాదాల్లో ఎక్కువగా వేగంగా వెళ్తున్న వాహనాల్లో బైకులు, కార్లు, లారీలు, ఆటోలు, టాటా ఏస్ వాహనాలు, ప్రైవేట్ బస్సులే ఎక్కువగా ఉంటున్నాయి.

**పరిమితికి మించి..**

వరంగల్ చుట్టూ జాతీయ రహదారి ఉంది. ప్రధాన రహదారులపై 80 కిలోమీటర్లు, కూడళ్లు, మలుపుల వద్ద 40 నుంచి 60 కిలో మీటర్ల మధ్య వేగంతోనే వాహనాలు వెళ్లాలి. కానీ 100 నుంచి 120 వేగంతో ప్రయాణించడంతో వాహనాలు అదుపు తప్పి బోల్తాపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే స్పీడ్‌తో ద్విచక్రవాహనం వెళ్తున్నాయి. ఈఏడాది ఖమ్మం జాతీయ రహదారి మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోనే 28 వరకు ప్రమాదాలు జరగగా.. 8మందిమృత్యువాత పడ్డారు. 20మంది వరకు గాయాల పాలయ్యారు.

**అటకెక్కిన తనిఖీలు..**

గతంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు నిత్యం రహదారులపై తనిఖీలు నిర్వహించే వారు. కొన్నేళ్ల నుంచి ఎంవీఐకి అటాచ్‌గా ఏఎంవీఐలు లేకపోవడంతో తనిఖీలు జరగడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లాలో ఆరు ఆర్టీఏ కార్యాలయాలు ఉన్నాయి. సరిపడా ఏఎంవీఐలు లేక జాతీయ రహదారులపై తనిఖీలు నిర్వహించడం లేదని తెలుస్తోంది. పోలీస్, ఎన్‌హెచ్‌ఏఐ,ఆర్టీఏ శాఖల సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయని రోడ్డు భద్రతానిపుణులు చెబుతున్నారు.




**వరంగల్‌ట్రై సిటీలోనే స్పీడ్‌గన్**

తెలంగాణ ఏర్పాటు అనంతరం ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఒక స్పీడ్ గన్ వాహనాన్ని కేటాయించింది. ఆ వాహనం జాతీయ రహదారులపై తిరుగుతూ అతివేగంగా వెళ్లే వాహనదారులకు అపరాధ రుసుం విధించేంది. అయితే జిల్లాల విభజన తర్వాత స్పీడ్‌గన్ వాహనం నగరానికే కేటాయించడంతో ట్రైసిటీ పరిధిలోనే వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ రహదారిపై స్పీడ్ గన్ కాకుండా కెమెరాలతోనే పోలీసులు వాహన వేగాన్ని గుర్తించి జరిమానా విధిస్తున్నారు. ప్రస్తుతం కెమెరాలు, వీడియోలతోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రంలోనే వాహన స్పీడ్‌ను గుర్తించి జరిమానాలు విధిస్తున్నట్లు సమాచారం. రహదారులపై స్పీడ్ గన్ లేకపోవడంతో వాహనదారుల్లో జరిమానాల భయం లేకుండా పోయింది. కాగా, ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను గుర్తించి స్పీడ్ గన్ వాహనాలు మరిన్ని పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

**సంయుక్త తనిఖీలు చేపడుతాం**



వాహనదారులు 60 నుంచి 80కి లోమీటర్ల వేగంతో వెళ్తే ఎలాంటి ప్రమాదాల జరగవు, ఇబ్బందులు ఉండవు. జాతీయ రహదారులపై ప్రమాదాలు నివారించడానికి అనుబంధ శాఖలతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తాం.


-సురేశ్‌రెడ్డి, డీటీసీ హనుమకొండ వరంగల్


ఇటీవల మామునూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాహనదారుడు(ఫైల్)

## అలరించిన ఐలమ్మ నృత్యరూపకం


చాకలి ఐలమ్మ నృత్యరూపకాన్ని వీక్షిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రముఖులు

- కాళోజీ కళాక్షేత్రంలో కాకతీయ నృత్యనాటకోత్సవాలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- హాజరైన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు


చాకలి ఐలమ్మ నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

హన్మకొండ కల్చరల్: చాకలి ఐలమ్మ నృత్యరూపకం ఆద్యంతం అలరించింది. తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న కాకతీయ నృత్యనాటకోత్సవాలు అకాడమీ చైర్‌పర్సన్ ఆచార్య అలేఖ్య పుంజాల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి నాటకోత్సవాలను ప్రారంభించారు. వీరవనిత చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను కూచిపూడి, జానపద శైలిలో అకాడమీ చైర్‌పర్సన్ ఆచార్య అలేఖ్య పుంజాల శిష్యబృందం ప్రదర్శించింది. సయ్యద్ ముఖ్దుం వ్యాఖ్యాతగా వ్యవహరించారు. హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, చాకలి ఐలమ్మ మునిమనవరాలు చిట్యాల శ్వేత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దసరాకు ఊరెళ్తున్నారా..?

- ఇల్లు భద్రం.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ క్రైం: దసరా సెలవులకు ఊరికి వెళ్లే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. పండుగల సందర్భంగా చోరీల నియంత్రణకు పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చోరీల కట్టడికి ప్రజలు సైతం తమ వంతు బాధ్యత వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు.

**ఇవే సూచనలు..**

- దసరా సెలవుల్లో బయటకు వెళ్తున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకోవాలి.
- తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీసుస్టేషన్‌లో లేదా మీ గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలి. వారి వివరాలు నమోదు చేసుకుని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తాం.
- ఊరికి వెళ్లాల్సి వస్తే బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. అంతేకాని పక్కింటి వారికి, తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దు.
- మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్క్ చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ వేయడం మంచిది.
- నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్, సెక్యూరిటీ గార్డు, సర్వెంట్‌గా నియమించుకోవాలి.
- సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్‌డేట్స్ పెట్టొద్దు.
- మీ ఇంట్లో స్వీయ రక్షణకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలి.ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు మొబైల్ లో మీ ఇంటిని, పరిసరాలను ప్రత్యక్షంగా చూసుకోవచ్చు. సెక్యూరిటీ సర్వేలైన్స్‌కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి.
- ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి.ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.
- ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలి. ఇంటి ముందు చెత్త, న్యూస్ పేపర్లు, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలి. వాటిని కూడా గమనించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుంది.
- మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలి. డయల్ 100కు కాల్ చేయండి.

### వివాహిత ఆత్మహత్య


రాధిక (ఫైల్)

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండలం కోమళ్ల గ్రామానికి చెందిన నీలం రాధిక (28) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీలం యాదగిరి, రాధిక దంపతులు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రాధిక శనివారం సాయంత్రం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. రాధిక మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

## మూడు బైక్‌లను ఢీకొని కారు బోల్తా..

- డ్రైవర్‌కు గాయాలు
- మహ్మద్‌గౌస్‌పల్లిలో ఘటన


బోల్తాపడిన కారు

ములుగు రూరల్: మూడు ద్విచక్రవాహనాలను ఢీకొని కారు బోల్తాపడింది. ఈ ఘటన ఆదివారం మల్లంపల్లి మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు వైపు నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న కారు మహ్మద్‌గౌస్‌పల్లి వద్దకు చేరుకోగానే నందిగామ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తి కారును గమనించకుండా రోడ్డు క్రాస్ చేశాడు. దీంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లు ధ్వంసమయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఏటూరునాగారానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కాగా, మేడారం పర్యటన ముగించుకొని హనుమకొండకు వెళ్తున్న పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఘటనాస్థలి వద్ద ఆగి ప్రమాదం పై ఆరా తీశారు.

# మిత్ర పురుగులు మాయం!


అక్షింతల పురుగు


గొల్లభామ పురుగు


కందిరీగ పురుగు


సాలీడు పురుగు


రెక్కల పురుగు

- పెరిగిన క్రిమిసంహారక మందుల వినియోగం
- జాగ్రత్త పడకపోతే ముప్పు

కాజీపేట : పురుగుల్లో మేలు చేసేవి సైతం ఉన్నాయి. అవును వినడానికి ఆశ్చర్యంగా ఉన్న ఇది నిజం. రైతుల కష్టాన్ని, ప్రకృతికి మేలు చేసే పురుగులు కూడా ఉన్నాయి. అందుకే వీటిని వ్యవసాయానికి మిత్ర పురుగులు అంటారు. అయితే తెగుళ్ల నివారణకు రైతులు క్రిమిసంహారక మందులను విచక్షణారహితంగా వాడడం వల్ల వాటి ప్రభావంతో మిత్ర పురుగులు క్రమంగా అంతరించిపోతున్నాయి. జిల్లాలో ఏటా సుమారు 1.34 లక్షల లీటర్ల క్రిమిసంహారక మందు వినియోగిస్తారని అధికారుల అంచనా. పంటలను నష్టపరిచే పురుగులతో పాటు వాటిని అదుపులో ఉంచే (బదనికలు), పరాన్న జీవులు (చీడ పురుగులపై జీవనం సాగించేవి) ఉన్నాయి. పంటలను ఆశించే చీడ పురుగులు ఎక్కడ ఉంటే ఇవి అక్కడికి వాలిపోతాయి.

**లేడీబర్డ్ బీటిల్స్ (అక్షింతల పురుగు)..**

ఎరుపు రెక్కలు.. నల్లటి మచ్చలతో అక్షింతల పురుగులు పత్తి చేలల్లో ఎక్కువగా సంచరిస్తాయి. ఇవి లార్వా దశలో ఎక్కువగా పేనుబంక పురుగులను తింటాయి. తల్లి పురుగులు 300-400 సన్నని పసుపు పచ్చని సూదులాంటి గుడ్లను ఆకుల అడుగు భాగంలో గుంపులుగా గుచ్చుతాయి. గుడ్ల నుంచి వచ్చిన పిల్ల పురుగులు 7-10 రోజుల వరకు, తల్లి పురుగులు 40-45 రోజుల వరకు చీడ పురుగులను తింటాయి.

**ప్రేయింగ్‌మేంటి (గొల్లభామ)..**

ఒకప్పుడు కుప్పలు తెప్పలుగా కనిపించిన గొల్లభామ ఇప్పుడు అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. ఇవి కూడా రైతులకు బాగా ఉపయోగపడతాయి. దీన్ని ఇంగ్లిష్‌లో ప్రేయింగ్‌మేంటీ అంటారు. ఇది పంటను ఆశించే ఆకురసం పీల్చే పురుగుతో పాటు ఇతర చీడ పురుగులను తింటుంది.

**ట్రయికోగామా (కందిరీగ)..**

పరాన్న జీవులకు సంబంధించిన ఈ కందీరిగ 200 రకాల చీడపురుగుల గుడ్ల దశలో ఆశిస్తాయి. తల్లి పురుగు 63-118 గుడ్లను పెడుతుంది. దీని జీవిత కాలం వారం రోజుల్లో ముగుస్తుంది. ఏటా 36 తరాలను వృద్ధి చేస్తోంది. రెక్కల పురుగు గుడ్లను శనగపచ్చ పురుగు గుడ్లలో పెడతాయి. అవి శనగ పచ్చ పురుగు గుడ్లను చంపి బయటకు వస్తాయి.

**సాలీడు పురుగులు..**

సాలీడు అనేక రకాల రంగుల్లో ఆకృతిలో ఉంటాయి. తల్లి, పిల్ల పురుగులు కలిసి పేనుబంక, పచ్చదోమ, ఆకుముడుత, ఎర్రనల్లి గుడ్లను తొలిదశలో ఉన్న లార్వాలను తింటాయి. తల్లి పురుగులు గుడ్ల సముదాయాన్ని ఆకులపై భాగాన పెడతాయి. ఇవి తెల్లని గోధుమ రంగు పల్చటి పొరతో కప్పబడి ఉంటాయి. మొక్కలను కదిలించినప్పుడు చురుకుగా కదులుతాయి.

**బ్రాకన్ కందిరీగ..**

ముదురు రంగు కందిరీగ వంటి పురుగులు కాయతొలుచు పురుగులపై గుడ్లు పెడతాయి. ఈ పురుగులు పిల్ల దశలో గొంగళి పురుగులను తిని జీవించడం వల్ల పంటలను ఆశించే కాయతొలుచు, గొంగళి పురుగులు నశిస్తాయి. వీటితో పాటు మైక్రో విలియా, మిరిడిబగ్, డామోల్స్, డ్రాగన్ ఈగలు, కత్తెర పురుగులు, తదితర మిత్ర పురుగులు చీడ పురుగులను తిని రైతులకు సహకరిస్తాయి.

**జీవ నియంత్రణే మేలు**

తెగుళ్ల నివారణకు జీవ నియంత్రణ పద్ధతి మేలు. పురుగు మందులను విచక్షణారహితంగా వాడడంతో చీడపీడలు రోగనిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నాయి. దీంతో రైతులు ఇంకా ఎక్కువగా పురుగు మందులను వాడాల్సి వస్తుంది. ఫలితంగా ఖర్చు ఎక్కువై దిగుబడులు తగ్గి ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటలను ఆశించే తెగుళ్లను ఎప్పటికప్పుడు తినేసి రైతులకు మేలు చేసే మిత్ర పురుగులపై దృష్టి సారిస్తే నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చు.

- సంతోష్, ఏఓ, కాజీపేట

**క్రయసోపా (అల్లిక రెక్కల పురుగు)..**

ఆకుపచ్చ రెక్కలు ఉండే ఈ పురుగు తూనీగ లాగా కనిపిస్తుంది. పొడవు 1-1.3 సెం.మీ, వెడల్పు 1-2 మి.మీ. కళ్లు బంగారం రంగులో మెరుస్తుంటాయి. ఈ పురుగు ఆకుల అడుగు భాగాన లేదా మొక్క ఇతర భాగాల అడుగున గుడ్లు పెడుతుంది. వాటి నుంచి పిల్ల పురుగులు మూడు, నాలుగు రోజుల్లో బయటకు వస్తాయి. లార్వా దశలో మూడుసార్లు మార్పు చెంది 8-10 రోజుల్లో పెద్దవి అవుతాయి. ఈ పురుగులకు వాడిగా దంతాలు ఉండడం వల్ల చీడపురుగులపై దాడి చేసి వాటిని తింటూ జీవిస్తాయి. ఇది లార్వా దశలో పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ, తొలిదశలో ఉన్న శనగపచ్చ పురుగు, గొంగళి, పొగాకు లద్దె పురుగులను తింటాయి. ప్రస్తుతం వీటిని కృత్రిమంగా ఉత్పత్తి చేసి విడుదల చేయాల్సిన పరిస్థితి నెలకొంది.


## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడు రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్ : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళను బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తితో పాటు ఆమెకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని శివునిపల్లి మసీదు వద్ద జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన బత్తుల రమేశ్ గంగిరెద్దులను ఆడిస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం వ్యక్తిగత పనులపై స్టేషన్‌ఘన్‌పూర్‌నకు బైక్‌పై వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. శివునిపల్లిలో దుకాణాల వద్ద భిక్షాటన చేస్తూ ఓ గుర్తు తెలియని మహిళ ఘన్‌పూర్-పాలకుర్తి రోడ్డులోని మజీద్ మలుపు సమీపంలో రోడ్డు దాటుతోంది. ఆమెను బైక్ ఢీకొనడంతో బైక్ నడుపుతున్న రమేశ్ ఎగిరి రోడ్డుపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా బైక్ ఢీకొనడంతో మహిళ తీవ్ర గాయాలపాలైంది. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా స్టేషన్‌ఘన్‌పూర్ 108 అంబులెన్స్ సిబ్బంది వారిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా రమేశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్


మాట్లాడుతున్న సాగర్

ఖిలా వరంగల్: రైతు సమస్యల పరిష్కారంలోకాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ ఆరోపించారు. వరంగల్ ఉర్సు గుట్టలోని పల్లం కన్వెన్షనల్ హాల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు ఆదివారం జరిగాయి. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వానాకాలం పంట రుణాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం వెనుకబడిందన్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. పత్తిపై దిగుమతి సుంకం ఎత్తివేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం ప్రమాదకరమని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు అన్నవరపు సత్యనారాయణ, బాల్‌రాజ్, సోమయ్య, మాదినేని రమేశ్, బుర్రి శ్రీరాములు, పుచ్చకాయల కృష్ణారెడ్డి, ఈసంపల్లి బాబు, కుమారస్వామి, చందునాయక్, చుక్కయ్య పాల్గొన్నారు.

## సాక్షి క్లాసిఫైడ్స్

**SERVICES**

**వధువు కావలెను**

- పురుషునికి 20 నుండి 30 సం॥లోపు రెండో వివాహం అర్థం చేసుకునే వధువు కావలెను. సంప్ర॥ 8500874860, 9347672025. [SCA25008362]

**WANTED**

- బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ (హన్మకొండ) డిజిటల్ & సోషల్ మీడియా మార్కెటింగ్ కొరకు 1 నుంచి 3 సం॥రాల అనుభవం మరియు నైపుణ్యం గల అభ్యర్థులు కావలెను. సంప్ర. 90105 91950. [M-13700]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి**

| | |
|---|---|
| వరంగల్ | 9705748198, 9866574715 |
| నర్సంపేట | 9553955722 |
| జనగామ | 9951602871 |
| మహబూబాబాద్ | 7702221602 |
| పరకాల | 9010299096 |
| జయశంకర్ భూపాలపల్లి | 9705748198 |

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## పండుగ పూట విషాదం

- ఆస్పత్రికి వెళ్లి జంపన్నవాగులో శవమై తేలిన వ్యక్తి

ఏటూరునాగారం: అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకుండా జంపన్న వాగులో శవమై తేలిన సంఘటన ఆదివారం ములుగు జిల్లా ఏటూరూనాగారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగపేట మండలం బోరునర్సాపురం గ్రామానికి చెందిన కోడి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం సామాజిక ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూనే ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబీకులు వెంకటేశ్వర్లు కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఓడవాడ సమీపంలోని జంపన్నవాగులో వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యమైంది. దీంతో పండుగ రోజు కుటుంబంలో విషాదం నెలకొంది.

## జీజీహెచ్‌లో మహిళ మృతి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన షాహెదా (45) అనారోగ్యంతో 8 గంటల సమయంలో ఆస్పత్రికి వచ్చింది. వైద్యులు అందుబాటులో లేకపోవడం , సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సరైన సమయంలో వైద్యం అందించకపోవడంతోనే షాహెదా మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు. ఈ విషయంలో వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం షాహెదా మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.